## నిరంతరాయంగా.. ధాన్యం కొనుగోలు ప్రక్రియ

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం / నిర్మల్ :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగాలని జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. ఆదివారం, జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా, లక్ష్మణచాంద మండలంలోని రాచాపూర్, సోన్ మండలం బొప్పారం గ్రామాలలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అకస్మికంగా నతనిఖీ చేశారు.అన్ని రికార్డులను పకడ్బందీగా నమోదు చేయాలని చెప్పారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా కొనుగోలు కేంద్రాలలో అన్ని వసతులు ఉండాలన్నారు. ధాన్యం, నిర్ణీత తేమ శాతానికి రాగానే తదూకం వేసి, లారీల ద్వారా గోదాములకు తరలించాలన్నారు. తూకం వేసిన ధాన్యం ఎట్టి పరిస్థితుల్లో కేంద్రాల్లో నిలువ ఉండకూడదని పేర్కొన్నారు. ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం గంజాల్ గ్రామంలోని రైస్ మిల్లును తనిఖీ చేశారు. సరిపడినంత మంది హమాలీలతో ఎప్పటికప్పుడు అన్‌లోడింగ్ ప్రక్రియను పూర్తి చేసుకుంటు ఉండాలని తెలిపారు. ఈ తనిఖీలలో అదనపు కలెక్టర్ రెవెన్యూ, కిషోర్ కుమార్, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సమగ్ర సవరణకు కంట్రోల్ రూం ఏర్పాటు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహణలో భాగంగా ప్రజల సౌకర్యార్థం జిల్లాలోని మెదక్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా జూన్ 15 వ తేదీ నుండి 24వ తేదీ వరకు 1 సన్నాహక, శిక్షణ, ముద్రణ కార్యక్రమాలు, జూన్ 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సందర్శన, జూలై 24వ తేదీన పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, 31వ తేదీన ముసాయిదా జాబితా ప్రచురణ నిర్వహించడం జరుగుతుందన్నారు. జూలై 31వ తేదీ నుండి ఆగస్టు 30వ తేదీ వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, సెప్టెంబర్ 28వ తేదీ వరకు ఫిర్యాదులు, అభ్యంతరాల పరిష్కారం ప్రక్రియ తరువాత అక్టోబర్ 1వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రజల సౌకర్యం కంట్రోల్ రూం 9553866388 నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని, పని దినాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, సందేహాలు, సమాచారం కొరకు కంట్రోల్ రూం లో సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

## చెరువు మరమ్మతుల పనులకు శ్రీకారం

### రూ. 39.50 లక్షల ఇరిగేషన్ నిధులతో పనులు



**ప్రజాపక్షం / భైంసా :** కుబీర్ మండలంలోని హంపోలి గ్రామంలో రూ. 39.50 లక్షల ఇరిగేషన్ నిధులతో చేపట్టనున్న చెరువు మరమ్మత్తుల పనులను ముఖ్య అతిథిగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొని ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధిలో చెరువుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యంగా పంట సాగు, వ్యవసాయ అవసరాల కోసం చెరువులు గ్రామాలకు జీవనాధారమని పేర్కొన్నారు. చెరువులు నిండుగా ఉండటం వల్ల భూగర్భ జలాలు పెరిగి బోర్లు బావుల్లో నీటి మట్టాలు మెరుగుపడతాయని తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఏకమై చెరువులను పరిరక్షించుకోవాలని, చెరువుల అక్రమణలు, కాలుష్యాన్ని నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం రైతులకు సాగు నీటి సౌకర్యాలు మెరుగుపడేలా ప్రత్యేక దృష్టితో పనిచేస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనలో భాగంగా చేపడుతున్న ఇటువంటి అ భివృద్ధి పనులు రైతులకు, గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. చెరువు మరమ్మత్తుల పనులు పూర్తయితే సాగునీటి సమస్యలు తగ్గడంతోపాటు పం టల ఉత్పత్తి కూడా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే.. విద్యార్థులకు నాణ్యమైన విద్య

**ప్రజాపక్షం / నిర్మల్ :** ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్, జిల్లాలో విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు, పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారని అన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తోందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు విద్యాబోధన అందిస్తున్నారని చెప్పారు. తాను కూడా ప్రభుత్వ బడుల్లోనే విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నాని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివి అనేక మంది ప్రపంచ స్థాయిలో ఉన్నత స్థానాలను చేరుకున్నారని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, పాటలు, యానిమేషన్, డాన్స్, పెయింటింగ్ వంటి రంగాల్లోనూ ప్రతిభ కనబర్చాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను ఉపాధ్యాయులు తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. ఈ ఏడాది 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చారని, ఇది జిల్లాకు గర్వకారణమని అన్నారు. మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. 10వ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న,అధికారులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

# అక్రమ దత్తత వద్దు.. చట్టబద్ధ దత్తతే ముద్దు

- చట్టబద్ధ దత్తతే పిల్లలకు భద్రమైన భవిష్యత్
- ప్రతి బిడ్డకూ ఒక కుటుంబం అవసరం
- శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి హేమభార్గవి




**ప్రజాపక్షం/మెదక్ :** పేదరికం, అవగాహన లోపం, మ ధ్యవర్తుల మోసాలతో చిన్నారులు అక్రమ దత్తతల బా రిన పడుతూ అమ్మకపు వస్తువుల్లా మారిపోయిన ఘటనలు సమాజాన్ని కలవరపరిచాయి. అక్రమ దత్తతలు, శిశు విక్రయాలకు అడ్డుకట్ట వేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధ దత్తత ప్రక్రియను మరింత కట్టుదిట్టం చేశాయి. చిన్నారుల భద్రత, భవిష్యత్తు, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా మెదక్ జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే మెదక్ జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 'ప్రతి బిడ్డకు ఒక కుటుంబం అవసరం' అనే నినాదంతో అక్రమ దత్తత వద్దు చట్టబద్ధ ద త్తతే ముద్దు అంటూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తోంది. చట్టబ ద్ధ దత్తతతోనే పిల్లలకు భద్రమైన భవిష్యత్ ఉంటుందని అవగాహన కల్పిస్తున్నారు. చట్టబద్ధ దత్తత ప్రక్రియను అనుసరించడం ద్వారా పిల్లలకు సురక్షితమైన జీవితం, కు టుంబ ప్రేమ, విద్య, ఆరోగ్యం వంటి హక్కులు లభిస్తాయని జిల్లా సంక్షేమ శాఖ అధికారి హేమభార్గవి పేర్కొన్నారు. అక్రమ మార్గాల్లో దత్తత తీసుకోవడం వల్ల పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడటమే కాకుండా చట్టపరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే చట్టబద్ధ దత్తత ప్రక్రియ జరుగుతుందని డిడబ్ల్యుఓ వెల్లడించారు.

### సిఎఆర్ఎ ద్వారానే దత్తత ప్రక్రియ..

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని సెంట్రల్ అడాప్షన్ రి సోర్స్ అథారిటీ (సీఏఆర్ఏ) ద్వారా మాత్రమే చట్టబద్ధ ద త్తత ప్రక్రియ కొనసాగుతుంది. ప్రత్యేక గుర్తింపు పొందిన స్పెషలైజిడ్ అడప్షన్ ఏజన్సిస్ (ఎస్ఏఏ) ద్వారా మాత్రమే పిల్లల దత్తతకు అనుమతి ఉంటుంది.

### అనాథ పిల్లలకు కొత్త జీవితం..

చట్టబద్ధ దత్తత వల్ల అనాథలు, నిరాశ్రయ చిన్నారులకు కుటుంబ వాతావరణం లభిస్తోందని డిడబ్ల్యుఓ హేమ భార్గవి తెలిపారు. సమాజం కూ డా బాధ్యతగా వ్యవహరి స్తే శిశు విక్రయాలు, అక్రమ దత్తతలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడ్డారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఏ ర్పాటు చేసే అవకాశం ఉందని చెప్పారు. సందేహాలు, స మాచారం కోసం జిల్లా బాలల పరిరక్షణ విభాగంను, ప్ర త్యేక హెల్ప్‌లైన్ 1098 అలాగే WWW. miss ionva tsalya. wcd. gov.in వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందన్నా రు. ప్రజలు అక్రమ దత్తతలకు దూరంగా ఉం డి, చట్టబద్ధ విధానాన్నే అనుసరించాలని సూచించారు.

## భవిష్యత్‌ను తీర్చిదిద్దే బాధ్యత గురువులదే

### విద్యా విజయోత్సవంలో ఎమ్మెల్యే, కలెక్టర్ వెల్లడి



**ప్రజాపక్షం/నిజామాబాద్:** విద్యాబుద్ధులు నేర్పించి భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యత గురువులపై ఉందని, బాధ్యతను ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికల 99 వారోత్సవాల ముగింపును పుస్కరించుకుని ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో విద్యా విజయోత్సవ దినం నిర్వహించారు. అర్బన్ ఎమ్మెల్యే, కలెక్టర్‌తో పాటు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు గడుగు గంగాధర్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి జ్యోతిప్రజ్వలనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వారోత్సవాలలో భాగంగా జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ సాధించిన ప్రగతిపై డీఈఓ అశోక్ ముందుగా నివేదిక చదివి వినిపించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ భావి భారత పౌరులైన విద్యార్థులకు చక్కటి భవిష్యత్తు నందించాల్సిన బాధ్యత గురువులదేనిన, అందుకే సమాజంలో గురువులను ఎంతో గౌరవం, గొప్పస్థానముందని గుర్తు చేశారు. 2047 వరకు దేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దాలనే ప్రధాని మోడీ సంకల్పాన్ని సాకారం చేసేలా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని కలలను సాకారం చేసేకునేలా నిజాయితీతో ముందుకెళ్లాలని మార్గనిర్దేశం చేశారు.

## రాజీవ్ మెమోరియల్ జ్యోతి యాత్రకు కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/నిజామాబాద్:** తమిళనాడు రాష్ట్రం చెన్నై నుంచి బయల్దేరిన రాజీవ్ మెమోరియల్ జ్యోతి యాత్రకు ఆదివారం జిల్లా కాంగ్రెస్ నాయకులు అర్బన్ డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణతో పాటుగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్‌రెడ్డి, గీత కార్మిక కోఆపరేటివ్ కార్పోరేషన్ చైర్మన్ శేఖర్‌గౌడ్ ఆహ్వానిస్తూ మాట్లాడారు. రాజీవ్‌గాంధీ సేవలను దేశం గర్వంగా స్మరించుకుంటుందన్నారు. 1944 ఆగస్టు 20న జన్మించిన రాజీవ్‌గాంధీ 1984 నుంచి 1989 వరకు దేశం 6వ ప్రధామంత్రిగా సేవలందించారన్నారు. యువత సాధికారత, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారన్నారు. ఆధునిక దేశ నిర్మాణానికి ఆయన కలిగిన దూరదృష్టి నేటికి యువతకు ప్రేరణగా నిలుస్తోందని ఘననివాళులర్పించారు.

## ఇసుక అక్రమ రవాణాపై మెరుపుదాడి

### భారీ లారీ స్వాధీనం,పోలీసు కమిషనర్ వెల్లడి



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్:** జిల్లాలో సహజ వనరుల సంరక్షణకు అక్రమ వ్యాపారాల నియంత్రణకు చీత ఫోర్సు ప్రత్యేక దృష్టి పెట్టినట్టు నిజామాబాద్ పోలీసు కమిషనర్‌సాయి చైతన్య అన్నారు. ఆదివారం పోలీసు కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు చీత ఫోర్సు బృందాలు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. సిసిఎస్ ఏసిపి ఇన్‌చార్జి మస్తాన్ అలీ ఆధ్వర్యంలో సిబ్బంది వేల్పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక భారీ 14 టైర్స్ లారీని గుర్తించి పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించి పట్టుబడిన లారీని తదుపరి చట్టపరమైన చర్యల కోసం సంబంధిత వేల్పూర్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వోకి అప్పగించి కేసు నమోదు చేసి విచారణ కొనసాగుతున్నట్టు తెలిపారు.

## నిర్మల్ రైతాంగానికి ఎమ్మెల్యే తీరని ద్రోహం


### మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



**ప్రజాపక్షం / నిర్మల్ :** నిర్మల్ నియోజకవర్గ ప్రస్తుత బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అవగాహన రాహిత్యం, స్వార్థ రాజకీయాల వల్ల సర్వత్రా అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి , ముఖ్య నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహేశ్వర్ రెడ్డి కేవలం ఒక ఫెయిల్యూర్ ఎమ్మెల్యే గానే కాక, నియోజకవర్గ ప్రగతిని పదేళ్ళు వెనక్కి నెట్టిన ఆపకీర్తిని మూటగట్టుకున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో వరి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ ఉన్న ఖానాపూర్, ముథోల్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో కొనుగోళ్ళు సాఫీగా సాగుతుంటే నిర్మల్‌లోనే అరాచకం రాజ్యమేలుతోందని ఆరోపించారు. ఎమ్మెల్యేకు కనీస పర్యవేక్షణ, బాధ్యత లోపించడం వల్లే రైతులు కల్లాల్లోనే వానకు తడుస్తూ అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న వస్తాకు 30 చొప్పు అక్రమ వసూళ్ళకు పాలపడుతున్నారని, వరి ధాన్యంలో తరుగు పేరిట క్వింటాలుకు 3 నుండి 3.5 కిలోలు ఎక్కువగా జోకుతూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ప్రాజెక్టులు, చెక్‌డ్యాముల నిర్మాణంతో నిర్మల్‌ను సస్యశ్యామలం చేశామని, కానీ ప్రస్తుత ఎమ్మెల్యే కొత్తగా ఒక్క పని కూడా తీసుకురాక పోగా, గత ప్రభుత్వం తెచ్చిన అభివృద్ధి పనులను ఆపడమే లక్ష్యంగా పెట్టుకున్నారని వివరించారు. 18 కోట్లతో మంజూరైన నర్సింగ్ కాలేజి పనులు ఇప్పటికీ శంకుస్థాపనకు నోచుకోలేదని, నిర్మల్ మెడికల్ కాలేజీ పనులను మౌఖిక ఆదేశాలతో నిలిపివేయడం దుర్మార్గమన్నారు. దీని వలన దాదాపు 25000 మంది రైతులు నష్టపోయారని, రాబోయే రోజుల్లో రైతాంగం ఆయనకు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## ప్రతిభగల విద్యార్థులకు ప్రోత్సాహకాలు

**ప్రజాపక్షం/నేరడిగొండ:** మండలంలోని వాంకిడి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల లో తెలంగాణ విద్యా వారోత్సవాల్లో భాగంగా ప్రధానోపాధ్యాయులు వివేకానంద కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ బండారు జ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువాతో సన్మానించి ప్రోత్సాహకాలు అందజేశారు.తెలుగు ఉపాధ్యాయులు వివేకనంద స్వామి మండలంలోనే టాపర్‌గా నలిచిన ఎస్ సరస్వతికి తన సొంత నిదుల నుండి ఐదు వేల రూపాయల నగదు చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిభగల విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని అన్నారు.గుణాత్మకమైన పథకాలను ప్రతి ఒక్కరు విద్యార్థి అందిపుచ్చుకొని ముందుకు వెళ్లాలని సూచించారు.అదేవిధంగా బుగ్గారం గురుకుల పాఠశాల విద్యార్థిని జె.అమిత పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించినందుకు ఆదిలాబాద్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా చేతుల మీదుగా మెమొంటోను అందుకున్నారని ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. పాఠశాల సిబ్బందిని, విద్యార్థిని పలువురు అభినందించారు.



## ప్రభుత్వ పాఠశాలలో విద్య విజయోత్సవ దినోత్సవం

### ముఖ్యఅతిథిగా.. సర్పంచ్,నవ్య నాగరాజ్ గౌడ్



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా 11052026 నుండి 17052026 వరకు నిర్వహిస్తున్న ఎడ్యుకేషన్ వీక్ కార్యక్రమంలో చివరి రోజును ఆదివారం విద్యా విజయోత్సవ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు, ఈ సందర్భంగా ఎస్ఎస్‌సీ పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఏఏపీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు. మొత్తం 11 మంది విద్యార్థులు అరుదైన ఘనత సాధించారు.వారిలో కవల సోదరీమణులు కుమారి స్వాజన 557 మార్కులతో మొదటి స్థానం, కుమారి సంజన 549 మార్కులతో రెండవ స్థానం సాధించి పాఠశాలకు విశేష కీర్తి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ మద్దూరి నవ్య నాగరాజు గౌడ్,ఉపసర్పంచ్ వీరబోయిన ప్రవీణ్ కుమార్ ముదిరాజ్, వార్డు సభ్యులు కనిగిరి అనసూయ కృష్ణ, బంటు కవిత శ్రీశైలం, నవీన సత్యనారాయణ, సురేష్,ఏఏపీసీ చైర్‌పర్సన్ ఖైరున్నిసా లు హాజరై విద్యార్థులను సన్మానించారు. ఒకే కుటుంబానికి చెందిన కవల సోదరీమణులు పాఠశాలలో మొదటి రెండు స్థానాలు సాధించడం ఎంతో ఆశ్చర్యం, ఆనందాన్ని కలిగించిందన్నారు. పాఠశాల పునఃప్రారంభ దినోత్సవాన్ని ఈ సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని, పాఠశాల ఆవరణను వివాహ వేడుకలా అలంకరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జూలై 2026లో పదవీ విరమణ పొందనున్న గణిత ఉపాధ్యాయులు ఎం.నాగిరెడ్డి ని ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.13 సంవత్సరాలకు పైగా అదే పాఠశాలలో అంకితభావంతో సేవలను అందించారని పేర్కొన్నారు.అలాగే ఈ నెలలో బదిలీపై వెళ్తున్న ఆఫీస్ సబార్డినేట్ రాకేష్ ని కూడా ఘనంగా సన్మానించారు. వీరిద్దరూ పాఠశాలకు 100 శాతం ఎస్ఎస్‌సీ ఫలితాలు సాధించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎం.హరికృష్ణ మాట్లాడుతూ, 420కు పైగా విద్యార్థుల బలం కలిగి పీఎం శ్రీ గుర్తింపు పొందిన పాఠశాల అయినప్పటికీ, ఇప్పటివరకు జూనియర్ అసిస్టెంట్ మరియు రికార్డ్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు కాలేదని తెలిపారు.ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి 202627 విద్యా సంవత్సరంలో ఆ పోస్టులను మంజూరు చేసి భర్తీ చేయించేలా కృషి చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. దీనికి స్పందించిన సర్పంచ్ సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పరిశుభ్రత వెనుక... పస్తుల బతుకులు

### నిర్మల్ జిల్లాలోని 400 గ్రామ పంచాయతీల్లో దయనీయంగా పారిశుద్ధ్య కార్మికుల స్థితి



**ప్రజాపక్షం / నిర్మల్ :** ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యాలను సైతం పణంగా పెట్టి గ్రామాల్లో ఉన్న చెత్తా చేదారం తొలగించి ఎప్పటికప్పుడు పరిశ్రుభ్రత పనులు స్కై నిర్వహించాల్సి ఉంటుంది. అలా నిత్యం పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతూ , ప్రజలను రోగాల బారిన పడకుండా కాపాడుతున్న పారిశుధ్య కార్మికుల జీవితాలు మాత్రం నేడు వేతన వవేదనలతో అందకారంలో మునిగిపోయాయి. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 400 గ్రామ పంచాయతీల్లో రాత్రింబవళ్ళు శ్రమిస్తూ పనులు చేస్తున్న వందలాది మంది పారిశుధ్య కార్మికులకు సక్రమంగా జీతాలు అందకపోవడంతో వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని మేజర్ పంచాయతీలతో పాటు అన్ని గ్రామాల్లో నిత్యం తమ ఆరోగ్యాలను పక్కపెట్టి వెట్టిచాకిరి చేస్తూ పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నా, నెలకు అందాల్సిన అరకొర వేతనం కూడా సకాలంలో రాకపోవడంతో కుటుంబాలను నెట్టుకురావడం కార్మికులకు కష్టతరంగా మారింది. కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు వేతనం సరిపోక మనోవేదన అనుభవిస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. నెల నెల ఒకటో తారీఖున జీతాలు పారిశుధ్య కార్మికులకు అందజేయక పోతే వారి పరిస్థితులు అగమ్యగోచరంగా మారుతున్నాయని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే పారిశుధ్య కార్మికుల కష్టాలు ఎవరు వర్ణించలేనివి, అలాంటి వారి పట్ల జీతాలు అందించడంలో జాప్యం జరిగతే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుందని కార్మిక సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కనీసం వేతనాలు కూడా పెరిగే పరిస్థితి లేకుండా పారిశుధ్య కార్మికులు చాలీ చాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారు. వస్తున్న అరకోర జీతాలు అందించడంలో కూడా ప్రభుత్వం నెలల తరబడి జాప్యం చేయడంతో కుటుంబ పోషణ భారంగా మారి, నిత్యావసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల ఊభిలోకి కూరుకుపోతున్నామని కార్మికులు కన్నీరు పెడుతున్నారు. జిల్లాలోని 400 గ్రామ పంచాయతీలలో ప్రతి పారిశుధ్య కార్మికుడికి కనీస వేతనం కూడా లేకుండా తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి పరిసరాలను పరిశుభ్రంగా చేయడం కష్టం మారుతోందని, నిత్యం ప్రజల ఆరోగ్యం దృష్ట్యా తమ ఆరోగ్యాలను లెక్కచేయకుండా పనులు నిర్వహిస్తున్నటువంటి వారికి ప్రభుత్వాలు వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఎండా, వాన, చలి అనే తేడా లేకుండా ఉదయం ఆరు గంటలకే పని కొచ్చి సాయంత్రం ఐదు గంటల వరకు ఇంటింటికి వెళ్ళి పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాలపై పాలకులకు, అధికారులకు పట్టదా అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 6 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

**ప్రజాపక్షం /సిర్పూర్ :** టిసిర్పూర్‌టి రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో అక్రమం గా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఆదివారం రో జున విశ్వసనీయ సమాచారం మేరకు ఎన్ఫోర్స్మెంట్ డీటీలు శ్రీనివాస్, రాజ్‌కుమార్‌లు మరియు సిర్పూర్‌టి పోలీసులు సంయుక్తంగా రైల్వే స్టేషన్ వద్ద తనిఖీ లు నిర్వహించారు.ఈ సందర్భంగా చంకపురే రమేష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై సుమారు ఒక క్వింటాల్ పీడీఎస్ బియ్యాన్ని రైల్వే స్టేషన్‌కు అక్రమ ర వాణా నిమిత్తం తీసుకువస్తుండగా అధికారులు పట్టుకొని కేసు నమోదు చేశా రు.అదేవిధంగా రైల్వే ప్లాట్‌ఫామ్‌పై, పరిసర ప్రాంతాల్లో మరియు సింగరేణి రైలులో ప్రత్యేక తనిఖీలు చేపట్టగా మరో ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.అధికారుల రాకను గమనించిన నిందితులు బియ్యాన్ని అక్కడే వదిలి పరారైనట్లు సమాచారం.మొత్తంగా సుమారు ఆరు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం రాయితీపై అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, తరలించడం లేదా దుర్వినియోగం చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



## ఎప్ సెట్ ఫలితాలు మోషన్ విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఆదివారం ప్రకటించిన ఎప్ సెట్ ఫలితాలలో హన్మకొండ లోని రాజస్థాన్ కోటా మోషన్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంక్ లు సాధించి ప్రభంజనం సృష్టించారని మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. బిట్ల హాసని 2384 ర్యాంక్ (2626T01163), ఇమ్మడి శరణ్య 3476 ర్యాంక్ (26 21 T0 5264), పలిక శ్రీ వర్ధిత 4792 ర్యాంక్ (2623T10020) అంచ ప్రవళిక 7673 (2621T01044) ర్యాంక్ లు సాధించినట్లు తెలియజేశారు. ఈ అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వారికి తోడ్పడిన అధ్యాపకులకు సహకరించిన తల్లి దండ్రులకు మోషన్ కాలేజీ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## 'శివాని' విశ్వరూపం



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** ప్రతిభావంతులైన విద్యార్థులను ర్యాంకర్లుగా తీర్చిదిద్దడం అందరికి సాధ్యమే. కానీ సాధారణ విద్యార్థులను ర్యాంకర్లుగా తీర్చిదిద్దడం శివానికే సాధ్యం. ఆదివారం ప్రకటించిన ఎప్ సెట్ ఫలితాలలో శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి విజయ దుందుభి మోగించారు. ఈ ఫలితాలలో కళాశాలకు చెందిన బి. స్వాతి 150వ ర్యాంక్, ఎన్. చరన్య 2426 ,కె.సౌందర్య 3649,ఏ.నవ్య 4435, ఏ. రత్య 4838,జి.పూజిత 574 4,పి.యశ్వంత్ 6475,ఈ. శ్రీశాంత్ వర్మ 6863,ఎం.ఐశ్వర్య 7166,ఈ క్రిష్ణజ 7840,బి.అంజన శ్రీ 8548, ఎన్. జస్వంత్ 9018,డి.సాయి కార్తికేయ 9114,సిహెచ్ అన్వేష్ 10318,పి.సహస్ర శ్రీ 10997 ర్యాంక్ లు సాధించారు. గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఫలితాలను సాధిస్తూ ఆదివారం ప్రకటించిన ఎప్ సెట్ 2026 ఫలితాలలో మరోసారి చరిత్రను తిరగరాస్తూ విభాగాలలో మంచి ర్యాంకులు సాధించిన శివాని విద్యార్థిని విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ టి. స్వామి, ప్రిన్సిపల్స్ జి. సురేందర్ రెడ్డి, వి. .చంద్రమోహన్, డైరెక్టర్లు టి రాజు, ఎన్. రమేష్, ఏ. మురళీధర్, వి. సురేష్, ఎస్. సంతోష్ రెడ్డి, అభినందనలు తెలిపారు. ఈ విజయానికి సహకరించిన కళాశాల అధ్యాపకులకు, విద్యార్థుల తల్లితండ్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

## నకిలీ పత్తి విత్తనాలు, ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**జిల్లాలో రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాలో ఎవరైనా నిషేధిత విత్తనాలు లేదా నకిలీ ఎరువులు విక్రయిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే పిడియాక్ట్ కింద కూడా చర్యలు తీసుకుని రెండేళ్ల వరకు జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. బిజి3 పత్తి విత్తనాలు పూర్తిగా నిషేధం విక్రయించడం చట్ట విరుద్ధమని, జిల్లాలో నకిలీ విత్తనాల అరికట్టటానికి ప్రతి మండలములో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల సమన్వయంతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ విత్తనాలు లేదా నకిలీ ఎరువుల విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీస్ అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలి




**ప్రజాపక్షం/మరిపెడ:**కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మరోసారి ప్రజలపై పెను భారన్ని మెపి పెట్రోల్,డీజిల్ పై మూడు రుపాయలు,వంట గ్యాస్ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ పై వంద రుపాయలు పెంచి దేశ ప్రజలపైన వాహనదారుల పైన పెను భారాన్ని మోపడాన్ని నిరసిస్తూ ఆదివారం మహాబుబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ ఆధ్వర్యంలో ఖమ్మం వరంగల్ జాతీయ రహాదారిపై ధర్నా చేశారు.ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లడుతూ బిజెపి ప్రభుత్వ నియతృత్వ పాలనకు పెంచిన ధరలే నిదర్శనమని,వెంటనే పెంచిన ధరలను తగ్గించాలనీ ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్,పట్టణ కార్యదర్శి మల్లెపాక యాకన్న,అంజి,నరేందర్,తదితరులు పాల్గోన్నారు.

## చేపల కోసం చెరువు నీరు ఖాళీ...



**ప్రజాపక్షం/తొర్రూరు :** చేపల కోసం చెరువులోని నీటిని ఖాళీ చేస్తున్నా వారిని వెంటనే గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండలంలోని హరిపిరాల గ్రామ చెరువులో చేపల కాంట్రాక్టర్‌కు అనుకూలంగా అధికారులు నీటిని వదులుతున్నారనే ఆరోపణలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. రైతులు, స్థానిక ప్రజలు ఈ చర్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో చేపల వేట కో సం నీటిని విడుదల చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల చేపల కాంట్రాక్టర్ చెరువులో చేపలు పట్టేందుకు అధికారుల సహకారంతో నీటి మట్టాన్ని తగ్గించే ప్రయత్నాలు జరగుతున్నాయని గ్రామస్తులు తెలుపుతున్నారు. చెరువులో ఉన్న మూడు తూముల నుండి నీటిని వదులుతుండట ంతో సాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి నీటి విడుదల వెంటనే నిలిపివేయాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

# మిల్లర్ల కోతలు...కష్టాల్లో రైతులు...

### కటింగ్ పెడితే నష్టపోతామంటున్న మిల్లర్లు
### నామమాత్రంగానే ధాన్యం కొనుగోళ్లు



**ప్రజాపక్షం/ములుగు:**ముందు నుయ్యి...వెనుక గొయ్యి అన్న తీరుగా ఉందని రైతుల పరిస్థితి చీడపీడలతో అంతంతమాత్రంగానే రైతులకు దిగుబడులు రాగా దానిని అమ్మాలంటే మాత్రం అరిగోస పడుతున్నారు. రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈసారి పంటకు అధిక చీడపీడలు తెల్లకంకి రావడంతో తాలు ఏర్పడడంతో మిషన్ కోత సమయంలో ధాన్యంలో తాలు కొంత మేరకు రావడంతో అలాంటి ధాన్యానికి మిల్లర్లు కోతలు పెడుతుండడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రావని ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు చేరిన ధాన్యాన్ని తాలు పేరుతో క్వింటాల్‌కు 5 నుండి 10 కిలోల వరకు తీస్తుండడంతో మాకు ఏం మిగులుతుందని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై మిల్లర్లను ఆరా తీస్తే మేము ప్రభుత్వానికి క్వింటాల్‌కు 67 కెజీల బియ్యాన్ని ఇవ్వాలంటే ధాన్యం నాణ్యతగా ఉంటే నే అది సాధ్యమని, తాలు ఉంటే తాము నష్టపోతామని మిల్లర్లు చెబుతున్నారు. రైతుల పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా మారింది. ప్రభుత్వం ఈ విషయంపై చొరవ తీసుకొని మిల్లర్లలో చర్చలు జరిపి రై తులకు నష్టం లేకుండా చూడాలని రైతులు కోరుతున్నా రు.

**తూర్పాల పడితేనే ధాన్యం తీసుకుంటాం**



రైతులు పండించిన ధాన్యం తూర్పాల పట్టకుండా మిల్లర్లకు వస్తే కటింగ్‌లు చేయక తప్పదు. ప్రభుత్వం క్వింటాల్‌కు 67 కిలోల బియ్యం ఇవ్వాలని అం టుంది. తాలు ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే అంత ఔటన్ రాదు. మేము నష్టపోతాం కాబట్టి రైతులు తూర్పాల పట్టి ధాన్యాన్ని మిల్లులకు తీసుకురావాలి అని రైస్ మిల్లర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుబాదం ప్రవీణ్ అన్నారు.

**.పెట్టుబడులు కూడా రావు..**
**ముంజ పర్వతాలు(రైతు)**



ఈసారి పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. పంట నాటు వేసిన నాటి నుండి చీడపీడలతో చాలా సార్లు పురుగుమందులు కొట్టిన కూడా పురుగు చావక అంతంత మాత్రంగానే దిగుబడులు వచ్చాయి. పంటను కొనుగో లు కేంద్రాల్లో విక్రయిస్తే మిల్లర్లు తాలు పేరుతో క్వింటాల్‌కు 5 నుండి 10 కిలోల కోతల పేరుతో మమ్మల్ని ఇ బ్బందులకు గురిచేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవు. మాకు పురుగుల మందే గతయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం చొరవ తీసుకొని కంటింగ్‌లు లేకుండా ధాన్యం దింపుకోవాలి.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

### మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు:**సమాజంలోని పేదరికం రూపుమాపే అత్యంత శక్తివంతమైన ఆయుధం కేవలం విద్య మాత్రమేనని, అక్షరజ్ఞానం మనిషిని సమాజలో ఉన్నతమైన వ్యక్తిగా నిలబెడుతుందని, ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో కార్పొరేట్ స్థాయికి మించిన నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అందుబాటులో ఉందని, విద్యారంగంలో ఏజెన్సీ ములుగు జిల్లాకు ప్రత్యేకమైన విశిష్టత లభించిందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల చూపు ములుగు జిల్లా వైపే ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్య విజయోత్సవ దినోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై రాష్ట్ర గేయాలాపనతో ప్రారంభించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ క్రీడలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు, తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ద్వారా ఒక్కొక్కరికి పదివేల రూపాయల నగదు ప్రోత్సాహం, పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు మంత్రి అనసూయ సీతక్క లాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూఇటీవల కాలంలో విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ములుగు జిల్లా వ్యాప్తంగా మొదటి స్థానంలో నిలవడం గర్వకారణంగా ఉందన్నారు. వైఫల్యాలకు కుంగిపోకుండా ప్రయత్నాన్ని కొనసాగించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫలితాలలో బాలికలే ఎక్కువ సంఖ్యలో సాధించిన విజయాలను అభినందిస్తూ, ములుగు జిల్లాకు చారిత్రాత్మక నేపథ్యం ఉందని, సమ్మక్క సారలమ్మ, రాణి రుద్రమాదేవి వంటి వీరనారుల స్ఫూర్తితో విద్యార్థులు మరింతగా రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్దార్థ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వీరేందర్, డిసిఇబి కార్యదర్శి ఈ సూర్యనారాయణ, సమ గ్ర శిక్ష కోఆర్డినేటర్లు శ్యామ్ సుందర్ రెడ్డి, రజి త, అడల్ట్ ఎడ్యుకేషన్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వేణుగోపాల్, టాస్ ఉల్లాస్ ములుగు జిల్లా కోఆర్డినేటర్ పీర్ల కృష్ణ బాబు, మండల విద్యాశాఖ అధికారులు వజ్జా తిరుపతి, కొయ్యడ మల్లయ్య, సాంబశివరావు, అవార్డు పొందిన విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యాభిమానులు పాల్గొన్నారు.

## లారీల జాప్యం... రైతులకు కష్టం



**ప్రజాపక్షం/మంగపేట :** మంగపేట మండలం బో రు నర్సాపూర్ గ్రామం ఆరుగాలం కష్టపడి చీడ పీడలు ప్రకృతి వైప రీత్యా ల నుంచి పంటను పొతి ళ్లలో బిడ్డలా కాపాడుకుంటున్న రైతుతీరాఆపంట చేతికొచ్చాక దాన్ని అమ్ముకుందామంటే సవాలక్ష నిబంధనలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ములుగు జిల్లాలోని అన్ని మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే ఆయా సొసైటీలు ఐకెపికేంద్రాల్లో లారీల కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రెండు మూడు రోజులకు ఒకసారి లారీలను పంపీయడం జరుగుతుంది. దీంతో తూకాలు వేసిన ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే పేరుకుపోతున్నాయి. ధాన్యం సేకరణలోని సమస్యలు పరిష్కరించాలని రైతన్నలు రోడ్డెక్కుతున్నా ఫలితం లేకుండా పోతోంది. ఆగ్రహించిన రైతన్నలు రోడ్డెక్కిన ఘటన మండలంలోని కమలాపురం ములుగు తాలూకా లారీ ఆఫీస్ ఎదుట రోడ్డుపై బైఠాయించి సుమారు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయాన్ని కలిగించారు. సమాచారం అందుకున్న పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగి రైతులకు నచ్చచెప్పి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో రైతులకు కొంత ఊరటనిచ్చింది.

## ఎమ్మెల్యే జీతం నుంచి విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

### ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అండగా ఎమ్మెల్యే నాయిని




**ప్రజాపక్షం / హనుమకొండ :** వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మరోసారి విద్యార్థుల పట్ల తన అభిమానం, బాధ్యతను చాటుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక"లో భాగంగా హనుమకొండ ఐడిఒసి సమావేశ మందిరంలో జరిగిన విద్యా విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం తరపున నగదు ప్రోత్సాహకాలు అందజేయడమే కాకుండా, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు తన సొంత ఎమ్మెల్యే వేతనం నుంచి అదనంగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున అందించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎమ్మెల్యే చేసిన ఈ వ్యక్తిగత ప్రోత్సాహం విద్యార్థులు, తల్లిదండ్రులను భావోద్వేగానికి గురిచేసింది. సభలో పాల్గొన్నవారు ఎమ్మెల్యే నిర్ణయాన్ని అభినందించారు.ఈ కార్యక్రమం ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. హనుమకొండ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.200 కోట్లతో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. గతంలో రాష్ట్రస్థాయిలో 18వ స్థానంలో ఉన్న హనుమకొండ జిల్లా, ఉపాధ్యాయుల కృషి, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఈ ఏడాది 9వ స్థానానికి చేరుకోవడం గర్వకారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిఇఒగిరిరాజ్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


## ఎస్ఆర్ కాలేజీ ప్రభంజనం



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఆదివారం వెలువడిన తెలంగాణ ఎప్ సెట్ 2026 ఫలితాలలో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెంది న వి. సా హ్యా (నెం.261 1T05015) బై పిసివిభాగంలో 14వ ర్యాంక్ సా ధించి రాష్ట్రంలో ఎస్ఆర్ విజయపథాన్ని ఎగురవేసారు.అదేవిధంగా కె. జీవన్ కుమార్ (నెం 2612A18108) బైపిసి విభాగంలో 91వ ర్యాంక్, కె. అశ్రిత (నెం.26 1 1T01057) బైపి సి విభాగంలో 262 ర్యాంక్, ఆర్. శ్రావణి (నెం.2 611A12054) బైపిసి విభాగంలో 298 ర్యాంక్, జి. యువన్ చంద్ర (నెం. 2626T05269) ఎంపిసి విభాగంలో రాష్ట్రస్థాయిలో 299వ ర్యాంకు సాధించి రాష్ట్రంలో ఎస్ఆర్ విజయపథాన్ని ఎగురవేశారు. అలాగే జే. స్వేత 351,జే .గురుమోహన్ చరణ్ 369,ఎన్ అవినాష్ 408, ఎన్. శివ కళ్యాణి 413,పి.సంజన 414,వై.సాత్వి క్ 476,ఆర్.నిరూప్ రెడ్డి 515, కే.జాహ్నవి 610,సిహెచ్ . ఆర్నవ్ 628, కే. దీరజ్ 654 ర్యాంక్ లు సాధించారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వాటిని ఆచరణ పరుస్తూ తమ విద్యార్థులకు చక్కటి సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తున్నామని ఈ సందర్భంగా ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఏ. వరదారెడ్డి తెలిపారు. టిజి ఎప్ సెట్ లో విద్యార్థులు సాధించిన ఈ విజయాలకు సంతోషాన్ని తెలియజేస్తూ ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, సంతోష్ రెడ్డి భవిష్యత్ లో మరింత అత్యుత్తమైన ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దుతామని ఆశాభావాన్ని వ్యక్తీకరించారు. ఈ సంవత్సరం జెఇఇ(మెయిన్స్) 2026 లో జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. ఈ ఫలితాలు విద్యార్థులందరికి స్ఫూర్తిదాయకం కావాలని ఆకాంక్షించారు.

## మొక్కజొన్న కొనుగోళ్ల ఆలస్యంతో ఆగిన రైతు గుండె...

### వడదెబ్బతో గాజుల పెద్ద వెంకటేశ్వర్లు మృతి..



**ప్రజాపక్షం/నెక్కొండ:**నెక్కొండ మండలంలోని అలంకానిపేట గ్రామానికి చెందిన రైతు గాజుల పెద్ద వెంకటేశ్వర్లు మొక్కజొన్న కొనుగోళ్ల ఆలస్యం కారణంగా తీవ్ర మనోవేదనకు గురై, వడదెబ్బతో మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. రైతు మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ ఏడాది ఆశతో మొక్కజొన్న సాగు చేసిన వెంకటేశ్వర్లు పంట కోత పూర్తయ్యాక కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్ళారు. అయితే కాంటాలు ఆలస్యమవడం, రోజులు గడిచిన ధాన్యం కొనుగోలు కాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. మండుతున్న ఎండల్లో కొనుగోలు కేం ద్రాల వద్ద తిరుగుతూ వడదెబ్బకు గురై న ఆయన ఆరోగ్యం క్షీణించి చివరకు ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట పండించడానికి చేసిన అప్పులు, పెట్టుబడులు తిరిగి రావాలంటే కొనుగోళ్లు జరగాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యం రై తులను మానసికంగా కుంగదీస్తుందని స్థానిక రైతులు మండిపడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం, కాంటాల జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో రైతు మృతితో విషాద ఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రైతు కుటుంబానికి ప్రభుత్వం తక్షణ సాయం అందించాలని, మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చే యాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## విద్యతోనే ఉన్నత శిఖరాలకు

**ప్రజాపక్షం/మహబూబాబాద్:**విద్యతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని, విద్యార్థలను జీవితాలను మార్చే శక్తి కేవలం విద్యకు మాత్రమే ఉందని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారం విద్యా వారోత్సవాలు ముగింపు పురస్కరించుకుని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మహబూబాబాద్ జిల్లాలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి గ్రూపులో ఒకరికి పదివేల రూపాయలు , శాలువా ప్రశంసా పత్రంతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్‌రావుతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి ఎ.సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యావారోత్సవాలు విద్యార్థుల్లో పోటీ భావన పెంపొందిచడమే కాకుండా ప్రతిభావంతులైన పిల్లలను మరింత తీర్చిదిద్దే వేదికగా నిలిచాయని, విద్యార్థులు తమ ప్రతిభతో జిల్లా గర్వించేలా నిలుస్తున్నారని కలెక్టర్ కొనియాడారు. ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు కలెక్టర్ తన సొంత డబ్బులతో నగదు ప్రోత్సాహకం అందజేసి అభినందించి ప్రతీ విద్యార్థిని, విద్యార్థి జీవితంలో కేవలం విద్య మాత్రమే తన జీవితాలను ఉన్నత స్థానాలకు చేరుస్తుందని సూచించారు. మున్సిపల్ చైర్మన్ గుగులోతు జ్యోతి, వార్డు కౌన్సిలర్ నీరుటి హేమ, డిఐఈఓ మదార్, ఏసిజి మందుల శ్రీరాములు, ఏఎఫ్ఓ శంకర్, డిసిబి సెక్రటరి బాలాజి, డిఎస్ఓ అప్పారావు, కోఆర్డినేటర్లు పి.పూర్ణచందర్, విజయకుమారి, వంగ సురేష్, కార్యాలయ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరావు, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్, స్కూల్ డిపార్ట్‌మెంట్ తో పాటు ఇంటర్మీడియట్ విద్య అధికారులు, విద్యార్థులు కళాశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హనుమకొండలో భూకబ్జా దేగలు

### రాత్రికి రాత్రే ఫెన్సింగ్‌లు , తాత్కాలిక షెడ్ల నిర్మాణం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఒకప్పుడు నగర అభివృద్ధికి ప్రతీకలుగా నిలిచిన కాలనీలు నేడు భూకబ్జాదారుల బారిన పడుతున్నాయనే ఆందోళన నగర ప్రజల్లో తీవ్రంగా వ్యక్తమవుతోంది. నగర విస్తరణ వేగంగా జరుగుతున్న కొద్దీ భూముల ధరలు అమాంతం పెరగడం, ఖాళీ స్థలాల విలువలు కోట్ల రూపాయలకు చేరుకోవడం, ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షణలో లోపాలు ఉండటం వంటి కారణాలతో అక్రమ భూకబ్జాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హనుమకొండ నగర పరిధిలోని పలు కాలనీలలో లేఅవుట్లలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన పార్కు స్థలాలు, దేవాలయ భూములు, కమ్యూనిటీ హాల్ స్థలాలు, ప్రభుత్వ ఖాళీ ప్రదేశాలు భూబకాసురుల లక్ష్యాలుగా మారినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అగ్గిపుల్ల, సబ్బు బిళ్ళ కవితకు కాదేది అనర్హం అన్నట్లుగా ప్రస్తుతం నగరంలో ఖాళీగా ఉన్న ప్రతి స్థలంపై కొందరు అక్రమదారులు కన్నేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎక్కడైనా ఖాళీ భూమి కనిపిస్తే చాలు దానికి నకిలీ బైనంబర్లు సృష్టించడం, పాత పత్రాలను మార్చడం, తప్పుడు సర్వే నంబర్లు జోడించడం, నకిలీ వారసత్వ ధృవపత్రాలు తయారు చేయించడం, ఆన్‌లైన్ రికార్డుల్లో మార్పులు చేయించే ప్రయత్నాలు జరగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల అక్రమదారులు రాత్రికి రాత్రే ఫెన్సింగ్‌లు వేయడం, తాత్కాలిక షెడ్లు నిర్మించడం, "ఇది ప్రైవేట్ స్థలం" అంటూ బోర్డులు పెట్టడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. ప్రజలు ప్రశ్నిస్తే తమ వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయని చూపిస్తూ బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపిస్తున్నారు.ప్రస్తుతం నగరంలో ఎక్కడికి వెళ్లినా భూకబ్జాల సమస్య వినిపిస్తోందని అధికారులు కూడా అంగీకరిస్తున్నారు. ఉన్నతాధికారులకు అందుతున్న ఫిర్యాదుల్లో ఎక్కువ శాతం ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, పార్కు భూముల వివాదాలకు సంబంధించినవేనని సమాచారం. రెవెన్యూ శాఖ, మున్సిపల్ శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, టౌన్ ప్లానింగ్ విభాగాల మధ్య పూర్తి స్థాయి డేటా సమన్వయం లేకపోవడం వల్ల భూకబ్జాదారులు అవకాశాలను వినియోగించుకుంటున్నారని చెబుతున్నారు. నగరంలో భూకబ్జాలను అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి కాలనీలో ఉన్న పార్కు స్థలాలు, దేవాలయ భూములు, ప్రభుత్వ ఖాళీ ప్రదేశాలపై డ్రోన్ సర్వే నిర్వహించాలని సూచిస్తున్నారు. నకిలీ రిజిస్ట్రేషన్లు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నగరాభివృద్ధి పేరుతో ప్రజల ఆస్తులు మాయమవకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

